# మధ్యతరగతి ఆడపిల్ల

రచన: కుమారి బాల త్రిపుర సుందరి

మండు టెండ చిటపటలాడిస్తూంది. ఇంటివైపు తొందర తొందరగా అడుగు వేస్తున్న శారద కిళ్ళీకొట్టు నీడలో తలదాచుకొన్న ముసిలిముష్టి దాన్ని చూసి ప్స్... అని బాధగా నిట్టూర్చింది. ఇంకో రెండడుగులు వేస్తే ఇంటికి చేరొచ్చు అనుకుంటూ తొందరగా పోతున్న శారద, 'అమ్మా! ఒక పైసావుంటే ధర్మం చేయండి' అన్న కేక వినిపించి ప్రక్కకు చూసింది. అంతే! శరీరమంతా గగుర్పొడిచింది. అక్కడ గోడప్రక్కన ఒంటినిండా కట్లతో బాధతో మూలుగుతున్న లెప్రసీవాడిని చూసి—

భగవంతుడా! ఎందుకిలా పుట్టిస్తావ్! ఏవిటి అనుభవించడానికి, అని బాధగా, పుస్తకంలోంచి 5 పై॥ తీసి, వాడి గుడ్డలో పడేసి ఇంటిని సమీపించింది.

లోపలినుంచి తండ్రి గొంతు విని ఒక్క క్షణం వీధి గుమ్మంలో ఆగిపోయింది;

'జానకీ! డబ్బులేదు. కొద్దిరోజులు ఓపికపట్టు. అమ్మాయికి ఏం కావాలో, ఏమో అడుగుతుంది కాస్తా వుండాలి' అన్నారు రామయ్యగారు.

'అబ్బ! ఏమిటండీ ఎన్నిసార్లు చెప్పినా మీ చెవికెక్కదు ఆడపిల్లలకు చదువెందుకు? ఎప్పటికైనా ఒక అయ్య చేతిలో పెట్టవల్సిందేగా. ఇక చాలండి, పి. యు. సి అయిపోయాక ఇంక ఆపేద్దామనుకుంటే, వూరుకోక పంతంపట్టి నర్సమ్మ ట్రెయినింగ్ అంటూ దాన్లో వేశారు. ఇంక రేపొద్దుట ఉద్యోగం అంటూ బయలుదేరుతుంది' అంది.

పోనీలేవే! ఏదో అమ్మాయి సరదా పడింది. చదవనీ కానీ, నా ఆర్థిక పరిస్థితి ఏమీ బాగోలేదు. ఎలా? ఏం చేయడం? అని బాధగా వాపోయేరు రామయ్యగారు.

ఇంక చాల్లెండి! ఇంతదాకా చదివింది. ఇంక ఆపి వేద్దాము, అయినా ఆడపిల్లకు అంత చదువెందుకు? దానికి తగ్గ సంబంధం చూసేసరికి తల ప్రాణం తోకకు వస్తుంది అంది జానకి.

'ఆడపిల్ల' అన్నమాటవిన్న శారద, అంతవరకూ అవాక్కయి నిలబడిపోయినట్లు ఒక వుదుటున తలుపుతీసుకొని పుస్తకాలు విసురుగా విసిరేసి, ఏమిటమ్మా! 'ఆడపిల్ల' 'ఆడపిల్ల' ని పదిసార్లు అంటారే? ఆడపిల్ల మనిషి కాదా! ఈ కాలం ఆడపిల్ల ఏం తక్కువ చేసింది. మగవాళ్ళతో సమానంగా చదువుతున్నారా? ఉద్యోగాలుచేసి తల్లిదండ్రులను పోషిస్తున్నారుకూడా. ఎంతచేసిన ఏం లాభం ముఖ్యంగా మీలో 'ఆడపిల్ల', 'అబల' అనే భావాలు పోవాలి. మీలో పోతేకాని పురుషులలోకూడా 'ఆడపిల్ల' రా అనే భావంపోవడానికి అవకాశం లేదు అంటూ దుఃఖంతో కూడిన గొంతుకతో అనేసి గిరుక్కున వెళ్ళిపోయింది.

సాంతంవిన్న జానకమ్మ, రామయ్యలు అవాక్కయి పోయేరు. జానకమ్మ తేరుకొని, చూశారుటండీ! ఎలా ఎగిరిందో: అయినా మీకే ఆలోచించండి. ఇంక రామం కాలేజి చదువుకు వచ్చేడు. సరళకూడా ఇంకా పెద్దక్లాసులోకి వస్తూంది. ఇంక రాధ సంగతి ఆలోచించండి! మీకెలాతోస్తే అలా చేయండి అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

'ఏం దారి! భగవంతుడా! అంటూ వాలుకుర్చీలో కూలబడ్డాడు మధ్య తరగతి కుటుంబీకుడైన రామయ్య.

దీంతో శారద చదువు ఆగిపోయింది. ఇంటి పనుల్లో ఒకమూలపడుండు పెళ్ళయ్యేంతవరకూ అంటూ మూల కూర్చోబెట్టారు. ఏమి చేయలేని శారద తలవంచింది.

శారదకు పెళ్ళి సంబంధాలు చూడసాగేరు. ఏదో సంతలో బేరమట్లు రావటంలో కాఫీలు సేవించడం, కట్నమెంత? లాంఛనాలేమిటి అని బేరాలు. 'పిల్ల నచ్చదనే' జవాబులతో తప్పుకోవడం, షరా: మామూలే అన్నట్లు పరిపాటయిపోయింది మగ పిల్లల్ని కన్న తల్లిదండ్రులకు. శారదకుకూడా ఏవో సంబంధాలు వచ్చేయి కానీ, ఏదో వంకసాకులతో, కట్నం చాలదన్న బాధ చెప్పలేక, తప్పించుకు పోయేవారేకాని ఒక్కరూ ముందుకు వచ్చిన పాపాన పోలేదు.

తెల్లవారింది. శారద చిన్న చెల్లెలికి ఎక్కాలుచెప్పు పుస్తకం చదువుతోంది. సరళ, రామం స్కూళ్ళకు వెళ్ళిపోయేరు. జానకమ్మ వరండాలో కూచుని బియ్యం ఏరుతూ—

ఏయ్ శారదా! నాన్నగారు ఇవాళైనా వస్తారా!? అప్పుడే పన్నెండవుతోంది కాబోలు, అంటూండగానే తలుపుచప్పుడయ్యేసరికి తలుపుదగ్గరికి పరుగెత్తింది శారద.

గుమ్మంలోనున్న రామయ్యగార్ని చూసి, అబ్బ! మాటలోవచ్చారండీ అంది జానకమ్మ భర్త మొహంలోని భావాలను కనిపెడుతూ.

తండ్రి మొహంలోకిచూసిన శారదకి కన్నులలోని వింతకాంతిని చూచి, వెళ్ళినపని జరిగినట్టుంది, అనుకుంటూ సిగ్గుతో తలవంచుకొంది.

'పిచ్చిపిల్ల' అనుకున్నారు రామయ్యగారు.

భోజనం ముందు కూచున్న రామయ్యగార్ని ఇంక ఆపుకోలేని జానకమ్మ 'ఏమండీ! వెళ్ళినపని ఏమయింది' అంటు పీటమీద కూర్చుని, విసనకర్రతో విసురుతూ అడిగేరు.

రామయ్యగారు తలఎత్తి భార్యవైపు సాభిప్రాయంగా చూసి 'శుభమే' అన్నారు.

ఆ! ఎన్నాళ్ళకి! పిల్లాడు. ఏం చదివాడండి? కట్నమెంత? ఏం వుద్యోగం? ఎంత జీతం; బావుంటాడా అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. తల్లి ఆతృతను వ్యక్తపర్చింది ప్రక్కనుంచి వింటున్న శారద.

అబ్బబ్బ! అయిందా! ఏమిటి నీ గొడవ? కొంచెం ఆగనీ సాఫీగా చెప్తాను - అన్నారు రామయ్యగారు సంతోషం వుట్టిపడుతున్న గొంతుకతో.

అబ్బ! చెప్పండి అంది జానకమ్మ.

పిల్లవాడి పేరు రఘునాథ్. 350 రూ॥ జీతం. అంతా 400 రూ॥ రావచ్చు. బావుంటాడు. బి. కాం. చదివేడు. ఇకపోతే 'కట్నం వద్దట' అని ఆగారు.

'కట్నం వద్దు' అనివిన్న జానకమ్మ సంభ్రమంగా భర్త మొహంలోకి చూసి 'నిజమేనా' అంది.

నిజమేనే. అమ్మాయి ఫోటో పంపితే చాలన్నారు. వచ్చి చూడక్కరలేదు అన్నారు.

ఇకేమిటండీ! పరవాలేదు. ఈ కాలంలో కూడా కొంచెం మంచి వాళ్ళున్నారు. అంటూ సంబరపడింది జానకమ్మ.

సరేలెండి. తొందరగా అమ్మాయి ఫోటో పంపండి. అన్నట్టు అబ్బాయి ఫోటోకాని యిచ్చారా! అని అడిగింది.

ఆ! ఇచ్చారే మరచిపోయాను అంటూ లేచారు రామయ్యగారు.

సాంతం విన్న శారద ఆశ్చర్యంతోను, సంతోషంతోను తలమునకలవుతూ తల్లిదండ్రులలోని సంతోషాన్ని చూసి తృప్తిగా నిట్టూర్చింది.

'భగవాన్! ఈ సంబంధం ఖాయం చెయ్యి. ఈ జన్మకిది చాలు' అని భగవంతుణ్ణి కోరుకుంది.

వారంరోజులు గడిచేయి. కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుతున్న శారదకి 'పోస్ట్' అన్న కేక విని, కవరందుకుని, పసుపుగుర్తులు చూసి సిగ్గుతో తండ్రి కందించింది. వియ్యాలవారినుంచి వచ్చిన జవాబు చూసి, సంతోషంతో జానకీ! ఇటురా! తొందరగా! అంటూ గావు కేకలు పెట్టారు రామయ్యగారు.

వస్తున్నానండీ! ఏమిటా గావు కేకలు- అంటు తడిచేతులు కొంగుకు తుడుచుకుంటు వచ్చింది.

జానకీ! వాళ్ళకి మన పిల్ల నచ్చిందట మన శారద అదృష్టవంతురాలు. ముహూర్తం కూడా నిశ్చయించేరు. అంటు అందరు సంబరపడిపోయేరు.

అబ్బ! ఎంత సంతోషవార్తండీ! ఇంక పెళ్ళిపనులు ప్రారంభించాలి. అంది జానకమ్మ.

పెళ్ళి దగ్గరపడింది. శారద యిల్లంతా పెళ్ళిసందడితో నిండిపోయింది. ఎక్కడ చూసినా చుట్టాలే. మర్నాడు పెళ్ళనగా మగ పెళ్ళివారి ఎదురు సన్నాహం కోసం అందరూ వెళ్ళిపోవడంతో శారద ఒక్కర్తె అయిపోయింది, మిగతా వారిలో అంత పరిచయం లేక లేకపోవడంవల్ల, పోస్ట్యాలాడటంవల్ల ఒంటరిదైన శారదకి ఏమే! శారదా! జ్ఞాపకమున్నానా! ఆదర్శ పెళ్ళిచేసుకుంటున్నావుట. కట్నం లేదటగా అంటు స్నేహితురాలైన రమణి పిలుపుతో-

పోవే! అని సిగ్గుపడింది.

ఎన్నాళ్ళకో కలుసుకొన్న ఇద్దరూ మాటల్లోపడ్డారు.

ఇంతలో బాండు వాయిద్యం విని-

ఓయి శారదా! బావగారొస్తున్నారు చూస్తాను. అంటూ వీధిలోకి పరుగు తీసింది రమణి.

పెళ్ళివార్ని విడిదిలో, దింపడం తోటలో దిగడం మొదలైన కార్యక్రమాలొక్కొక్కటి జరుగుతున్నాయి. పెళ్ళికొడుకు కాళ్లు పెళ్ళికూతురు తండ్రి కడిగే తంతు జరుగుతోంది.

ఇంతలో పెళ్ళికొడుకు స్నేహితులు-

ఏమిట్రా రఘూ! మేజోళ్ళయిన విప్పకుండా కూచున్నావే? మీ మామగారు నీ కాళ్ళు కడుగుతార్రా! అంటూ ఎగతాళీ పట్టించేరు.

'బాబూ! మేజోళ్ళు విప్పు.! మామగారు కాళ్ళు కడిగి, కన్యాదానం చేస్తారు' అని పురోహితుడు తొందర చేయసాగాడు. నిస్సహాయుడైన రఘు తల్లివైపు జాలిగా చూసేడు.

పర్వాలేదు నాయనా! విప్పు. అన్నారు పెళ్లికొడుకు తల్లి కాంతమ్మ.

బలవంతంగా మెల్లగా విప్పదీరాడు రఘు. అంతే! కుడికాలి బొటనవేలు, రెండో వేలు సగమే వుండటం చూసిన రామయ్యగారు 'గతుక్కుమని' పెళ్లికొడుకు తండ్రియైన రాఘవయ్య వైపు అనుమానంగా చూసేరు.

నీళ్ళు కారిపోతున్న రాఘవయ్య, ధైర్యం కూడదీసుకొని నవ్వుముఖంతో, ఏం లేదండీ! చిన్నప్పుడు [illegible] చేసి ఆవేశంలో వంకరపోయేయి అన్నాడు.

అంతేకదా! అని భారంగా వూపిరి పీల్చారు శారద తల్లిదండ్రులు.

ఇదంతా చూస్తున్న రఘు స్నేహితులు మరి నిలువలేక విచార వదనాలతో పెళ్ళిపందిరి దాటిపోయేరు.

ఈ సంభాషణంతా అడ్డుగావున్న తెరకి అటువైపున వున్న శారద విని ఒక్కసారి హృదయంలో ముల్లుగుచ్చుకున్నట్టయి, ఏమిటిది, భగవాన్, అనుకుంది. తెరలోంచి

చూడడానికి ప్రయత్నించింది. కాని, కనబడలేదు పిచ్చి శారదకి.

ఇంతలో తెరతీసేసి ఇద్దర్నీ ఒక పెళ్ళిపీటపై కూర్చొనున్నారు. తెర తీసేసరికి శారద దృష్టి రఘు కాళ్ళపై పడింది గాని పంచెకోసలు రఘు కాళ్ళని కలిపేసింది. జరగవలసినదంతా జరిగి, 'మంగళసూత్రధారణ' కూడా జరిగిపోయింది.

సామాన్లగదిలో కూర్చున్న శారదకి ప్రక్కనుండి వస్తున్న ఒక్కొక్కమాట, ఒక్కొక్క ఈటెలా తగల సాగింది.

ఏమో అక్కా! పెళ్ళికూతురు చాలా బాగుందికదూ! అయినా ఏం లాభం. పాపం! వాళ్లు చూసుకోలేదు కాబోలు. అయినా ఆ అబ్బాయికి నిజంగా పక్క కరిచిందంటావా! అయినా ఆ అమ్మాయికి అన్యాయం చేశారు.

ఇదంతా విన్న శారద హృదయం కంపించుచుండగా తలుపులు తీసి, చూసింది. పెళ్లికి వచ్చిన మగపెళ్లివారి చుట్టాలు అనుకుంటున్న వారిలా శారదను చూసి, ఆ ప్రసంగం మార్చేశారు.

హు! పిచ్చివాళ్లు విన్లేదనుకున్నారు. వినేశాను అనుకుంది శారద. ఎటువైపు వెళ్ళినా అందరం ఈ విషయమే చర్చించుకోవడంవల్ల శారద తల్లిదండ్రులకి ఏదోఅనుమానం గుండెలను పిండసాగింది. కాని పెళ్ళైపోయాక ఏమీచేయిలేని నిస్సహాయులై దేవుడిపై భారం వేసి, నిట్టూర్చారు.

అదే శోభనం. లోపలికి అడుగుపెట్టిన శారద రఘు కాళ్ళవైపు దృష్టినిసారించింది. కాళ్ళకి మేజోళ్లు చూసి గుండె పిండినట్లయి, అనుమానభయాలతో రఘు మొహం వైపు చూసింది. ఏ భావం కానరాని మొహం చూసి, దుఃఖం ఆపుకోలేక, పరుగున వెళ్లి, రఘు కాళ్ళు పట్టుకొని, 'ఏమండీ! చెప్పండి! పెళ్లిపందిరిలో అందరూ ఏమిటేమిటో అనుకుంటున్నారు అవన్నీ నిజంకాదని చెప్పండి.' అంటూ విలపించసాగింది.

దుఃఖంలోంచి తేరుకొని, అంతెందుకు! నాకు కొంచె వైద్యం తెలుసు. నేను నర్సింగ్ ట్రెయినింగు పొందాను. మేజోళ్లు విప్పండి. నేను స్వయంగా చూసి నా అనుమానం నివృత్తి చేసుకుంటాను అని ప్రాధేయపడింది.

సరే శారదా! ఇంతదాకా వచ్చేక మరెందుకు కాని నీ తుదినిర్ణయం చేసుకొనేముందు నన్ను క్షమించు అంటూ మేజోళ్ళు విప్పేడు.

కాలివేళ్లను పరీక్షించిన శారద—

భగవాన్! ఎందుకు నాకీ శిక్ష! నేనేం పాపం చేసానని, అనేక విధాల బాధతో నిండిన శారద, ఆ బాధంతా కసిగామారి రఘుపై వెళ్ళగ్రక్కింది.

ఏమండీ! నిజం చెప్పండి. మీకు వాళ్లనుకుంటున్నదేనా? ఎందుకు నాకీ అన్యాయంచేశారు. పైగా! హు క్షమించాలా! ఏం మీరు మగవాళ్ళనా? లేక ఆడవాళ్ళముకదా! ఏం చేస్తుంది అనేకదూ! మాకు ముందు ఎందుకు చెప్పలేదు? ఎందుకు చెప్తారు ఇదే మీ స్థితిలో నేనుంటే ఏం చేస్తారు చెప్పండి? కట్నం అక్కర్లేదనడంలోనూ, మావల్ల లోపాలుజరిగినా సర్దుకుపోవడంలో గల మర్మంఇదా? కాని ఇల్లాంటిలోపం అని ఏమనస్సులు తలంచలేదే, నేనే మీ స్థానంలోవుంటే మీరేం చేస్తారో చెప్పనా? పుట్టింటికి పంపించేస్తారు. లేదా నలుగురిలో పెట్టి అవమానించి, విడాకులిస్తారు. లేకపోతే లోపంవున్నా యింటినుండి డబ్బుతెమ్మని తరిమేస్తారు. అంతేనా! నేను ఇప్పుడీ లోపం మీకున్నా ఏం చేయగలననేకదూ మీ ధైర్యం? ఎందుకండీ నాకీ శిక్ష; భగవాన్! కట్నం అక్కర్లేదనంటే ఎంతో ఉదాత్తు అనుకొన్నాను. కాని, ఘోరఅన్యాయంతలపెట్టే వంచకు అనుకోలేదు. అయినా మీరు నన్ను మీతోపాటు పెరగాలని ఎలా కోరుతున్నారు? నాకు పెళ్ళికాకపోతే కన్యగానే వుండిపోదును. కాని నాకెందుకీ శిక్ష? అంటు చేతుల్లో ముఖం దాచుకుంది శారద.

భుజంమీద లాలనగా నిమురుతున్న రఘు చేతిని విడిపించుకొని, బంధింపబడివున్న కిటికీ తలుపులు తెరచి, శూన్యంలోకి చూస్తున్న శారదకి గోడవైపున లెప్రసీవాడు జ్ఞాపకానికివచ్చి రెండుచేతుల్తో మొహానికి కప్పుకొని, శూన్యంలో ఏదో వెతుకుతున్న శారద ఏమీ చేయలేని, నిస్సహాయురాలైన 'ఆడది'గా ఉండిపోయింది.

